# కళ్ళు

'మీకు టెలిపతీమీద నమ్మకం వుందా?'

వొంగుని జబ్బలో ఇంజక్షన్ ఇస్తున్న వాడిని ఉలిక్కిపడ్డాను ఆ ప్రశ్నకి నా మనసులో భావాలు చదివిగానీ ఈ ప్రశ్న వేయలేదుకదా! క్రింది పెదివిని పై పంటితో నొక్కిపట్టి ఆ ప్రశ్న విననట్టే ఇంజక్షన్ ఇచ్చేశాను

క్షణకాలం మూలిగి అంతలోనే ఎప్పటిలాగే ముఖంనిండా నవ్వు పులుముకుంది అమృత ఆ నవ్వే అదే నవ్వు నన్ను చిత్తు చేస్తుంది

'అమృతా' ఆమె మాటలకి అంతరాయం కలిగించాను

ప్రతిరోజూ అదే సమయంలో ఆ బెడ్ దగ్గర హఠాత్తుగా నా కాళ్ళు ఆగిపోతుంటాయి నాకు తెలుసు చుట్టూ వున్న ఈ జనానికి నా రాక, యిక్కడ ఆగి ఈ పేషెంట్ తో మాట్లాడడం సందడిని కలిగిస్తాయని ఎప్పటికప్పుడే 'వీల్లేదు' రేపట్నుంచి నన్ను నేను పరిధిలో బిగించుకోవాలి అనుకుంటూనే బలహీనతకు లొంగిపోతున్నాను. తొమ్మిది గంటలలోగా రోజూ ఎదురుచూసే ఆ సమయం నాకు ఎంత అమూల్యమైనదో తెలుసును అయినా నేనూ సామాన్యుడినే అందుకే ఆ బెడ్ దగ్గర అమృతతో మాట్లాడుతూ ఆగిపోయాను

'మీకో చిన్న ఉపమానం చెబుతాను. గలగలా ప్రవహించే నది. దానికో వారధి. ఇవతలి ఒడ్డున పుట్టుక అతవల వైపు మృత్యువు ప్రతి మనిషీ ఆ వారధిమీదే పయనించాలి అది నియమం తన గమ్యం మరణం అని తెలుసు అయినా వారధి చివరికంటా నడవడానికి ప్రయత్నిస్తాడు మార్గం మధ్యలో ప్రమాదవశాత్తూ జారి నదిలో పడేవాళ్ళ సంఖ్య కొంచెం ఎక్కువ ఉంటుంది. అవే అర్ధాంతరం చావులు యాక్సిడెంట్స్ వల్ల, రోగాలవల్ల సంభవించేవి

ఇకపోతే డాక్టర్స్ యీ బ్రిడ్జికి రైలింగ్స్ వంటివాళ్లు యీ అర్ధాంతరపు చావులని ఆపటానికి


నా వాక్ప్రవాహానికి అడ్డు కలిగిస్తూ అంది

'భలేవారే మొత్తానికి రచయితననిపించారు' అమృత నవ్వింది! చిన్న మాటని పట్టుకొని పెద్ద ఉపన్యాసం దంచారు

చిన్నగా నవ్వి అక్కడనుంచి బైటపడ్డాను కానీ నాతోపాటు వచ్చే ఆలోచనల్ని ఎక్కడికి తరమను?

టెలిపతీ పంచేంద్రియాలలో కాక

జి. ఎస్. ఆర్. మూర్తి (మెడికో)



మనిషి ఇంకో మనిషితో సంభాషించడం దీనినే సిక్త్స్‌సెన్స్ అంటారు

ఆమె ఈ వార్డుకు వచ్చినప్పటినుంచీ నేను ఆమె గురించి ఆలోచించని క్షణం లేదేమో?

తెలిసి తెలిసి మనసు పారేసుకున్న మనిషిని నేను.

ఆమె నాకేకాదు ఎవరికీ దక్కదని తెలుసు అయినప్పటికీ ఆమె పట్ల ఎందుకు ఆకర్షితుడి నయ్యానో ఆ భగవంతుడికే తెలియాలి.

ఆలోచనల్లో వున్న నేను వులిక్కిపడ్డాను 'సార్ ఇరవయ్యో నెంబర్ బెడ్‌మీద వున్నతనిని ఒకసారి చూడాలి మీరు' అటెండర్ చెప్పింది.

పరుగులాంటి నడకతో ఆ బెడ్‌కి చేరుకున్నాను

* * *

అర్ధరాత్రి హఠాత్తుగా మెలుకువ వచ్చింది

ఎంత పీడకల?

అమృత ఏమైనా అయిపోయి వుండదుకదా.

మంటలు, మంటలు, మంటలు నా చుట్టూ లేచి ఆ మంటలు నన్నెందుకింత భయభ్రాంతుడిని చేస్తున్నాయి. మన స్ఫూర్తిగా 'నా అమృతా' అని ఎలుగెత్తి పిలవాలని వుంది. అయినా నా గొంతు సంస్కరణ పేర ఏ అదృశ్య శక్తో పీక నులిమి నా గది గడప దాట నీయడంలేదు. అప్పటికప్పుడు హాస్పిటల్‌కి వెళ్లాలన్న కోరికని బలవంతంగాఅదిమిపెట్టాను.

ఆ రాత్రి అంతా కలత నిద్రతో తెల్లవారింది. రోజూకంటే తొందరగా బయలుదేరి వెళ్ళాను హాస్పిటల్‌కి ఇంజక్షన్ లోడ్‌చేసి ఒక్కొక్కరికీ యిచ్చి చివరి బెడ్‌కి చేరుకున్నాను.

'హలో ' అమృత పలకరించింది.

నేను నిజానికి అక్కడికే త్వరగా రావాలి కానీ అమృత బెడ్ దగ్గరికి వెళ్లడం నలుగురికీ నేనూ ఆమే ఎగ్జిబిట్స్

కావటం నాకు యిష్టంలేదు ఆమె పలకరింపుకి నా మొహంలో వెలుగు లాంటిది కలిగివుంటుంది బహుశా

'నిన్నటి ప్రశ్నకు జవాబు యివ్వనే లేదు మీరు!' నిష్ఠూరంగా అంది

ఆమె ప్రక్కన మాగజైన్స్ యింగ్లీషువే ఎక్కువగా వున్నాయి

'మీకు లిటరేచర్ అంటే యిష్టంలా వుంది'

'మీరు మాట మరిపిస్తున్నారు'

'అహ! అదేంలేదు మీరు నిన్న అడిగిన ప్రశ్న మరచిపోయాను ఏమన్నాడు తొలిపతి మీద నమ్మకమా, అని కదూ అడిగారు!'

'ఆ!'

'వుంది' అంతలోనే గంభీరంగా మారిపోయాను

'ఒక్కో వ్యక్తిని మొదటిసారి చూస్తున్నా అకారణంగా చిరాకు, ఇంకో వ్యక్తిని చూస్తే ప్రేమ యివన్నీ దాని వల్లే అని నా నమ్మకం అలాగే ఒక్కో మనిషితో మనం మాట్లాడకపోయినా మనకి తెలుస్తుంది, అతనికి మనమంటే విపరీతమైన ద్వేషమైనా, యిష్టమైనా వుంటే నేను చదువుకునే రోజుల్లో ఒకతను అంటే నాకు విపరీతమైన ఇష్టంవుండేది ఎందుకో గానీ'

'అతను నాతోపాటు బస్సులో వచ్చే వాడు అతను నాకు దరిదాపుల్లో ఎక్కడ వున్నా నాకు తెలిసేది,' అనేసి 'మీకు రాత్రి నిద్రలేదు కదూ', అని సంభాషణ కావాలనే మార్చేశాను

అమృత నవ్వాలని ప్రయత్నం చేసింది 'లేదు రాత్రంతా కలలతో అలజడితో నిద్రపట్టలేదు ఏవో పీడ కలలు'

కుతూహలంగా ముందుకు జరిగాను.

'మంటలు నన్ను చుట్టుముట్టి కబళించేసే మంటలు కెవ్వున అరవాలను కుంటాను కానీ అరవలేను'


నా ఆశ్చర్యం నేను వ్యక్తపరచ లేదు ఆమె బ్రతుకు నాకు తెలుసు. మనిషికి ఆశ పెంచడం నాకు యిష్టం లేదు ఆమెమీద వున్న నా యిష్టాన్ని నేనే సమాధి చేసుకుంటున్నాను

* * *

ఆ రోజు అవుట్ పేషెంట్స్‌ని చూసేరోజు కనుక అమృత దగ్గరకు వెళ్ళేసరికి ఆలస్యం అయింది

మధ్యలో కొంచెం తీరిక వున్నా ఆమెతో గడిపేయటం అలవాటయింది.

ఆమెలో నన్ను బాగా ఆకర్షించినవి ఆమె కళ్ళు అసలు పేషెంట్సు కళ్ళు జీవంలేనట్లు వుంటాయి కానీ అదేమి విచిత్రమో ఆమె కళ్ళుమాత్రం మిల మిల మెరుస్తూ వుంటాయి అల్చిప్ప ల్లాంటి కళ్ళు ఆమె మౌనంగావున్నా కబుర్లు చెబుతున్నట్లే టపటప లాడుతూ వుంటాయి బిపి చూసి కేస్‌షీట్ చేతి లోకి తీసుకుంటూ అడిగాను




'ఇన్ని యేళ్లూ ఎందుకు అశ్రద్ధచేశావ్ అమృతా ?'

'ఇప్పుడైనా వచ్చేదానినికాను కానీ ఓ కోరిక పుట్టింది చరమాంకం హాస్పిటల్‌లో గడపాలని '

'అమృతా ' నాకు తెలియకుండా గద్గదికంగా వచ్చింది ఆ పిలుపు

'సారీ డాక్టర్ ' దెబ్బతిన్నదానిలా చూడడం ఆమెవంతు అయింది ఈసారి

నేను ఆమెవైపు చూశాను

అమృతి కళ్ళు వాల్చుకుంది

'ఎవరున్నారు అని వస్తాను డాక్టర్ అదేమి అదృష్టమో అందరూ వుండీ అనాధను అయాను కట్నం లేకుండా చేసుకున్నాడు అతను ఈ అందం అతని విశాల హృదయాన్ని పాపం ఆకట్టుకుంది

'చివరికి ఈ అందమే నాకు శత్రువై నన్ను కాటేసింది బయట నిల్చుంటే అనుమానం అతనికి కూర్చుంటే అనుమానం పోస్టుమాన్ దగ్గర్నుంచి ఎలక్ట్రిక్ బిల్ చూసే అతనివరకూ నాతో సంబంధం పెట్టుకున్నట్లే ప్రచారం చేశాడు వీలుదొరికితే చావబాది తృప్తి పడేవాడు '

'ఒక మాటలో చెప్పాలంటే నా కలలో కనబడ్డ మనిషితో నాకు సంబంధం అంటగట్టి మీకు అర్థంకాదు పోనియ్యండి.'

ముఖం అటు తిప్పుకుంది

నేను అక్కడ్నుంచి ముందుకు అడుగువేశాను

అయితే అమృతకు పెళ్ళి అయిందా? ఆమె మెళ్ళో వాటి తాలూకు చిహ్నాలే లేవే? అతనులేడేమో! మరి ఆ బొట్టు ప్రేమ గుడ్డిదేకాదు చెవిటిదికూడానేమో? అందుకే నా ఈ గుండె అమృతకోసం

పరితపిస్తోంది. ప్రపంచంలో అందని వాటికి విలువలు ఎక్కువగా వుంటాయి. మమకారం వాటిమీదే వుంటుంది.

రేపో మాపో రాలిపోతుందని తెలిసినా అమృతమీద నాకింత అనురాగం దేనికి? బహుశా నిమిషమాత్రం వుండే పారిజాతం పరిమళంలా అమృత ప్రేమ ఈ జీవిత కాలానికి సరిపోతుంది నాకు!

* * *

ఆ రోజు

'డాక్టర్!' అమృత పిలుపు నన్ను పక్కనేవున్న స్టూల్ మీద కూర్చోబెట్టింది.

'చెప్పు?'

'మిమ్మల్ని వెలిపతీ గురించి అడిగాను గుర్తుందా! చెబితే పిచ్చిదానిని అనుకుంటారేమో డాక్టర్. నాకు చెప్పుకుందుకు ఎవరూలేరు. ఎవరో ఒక యువకుడు బహుశః ముప్పై ఏళ్ళు వుండివుంటాయి. అతని రూపురేఖలు స్పష్టంగా కనబడతాయి. రోజూ నేను పడుకున్న సమయానికి లీలగా ప్రత్యక్షం అవుతాడు!'

'ఒకటీ రెండూకాదు పదేళ్ళనుంచీ చూస్తున్నాను అతనిని! కల అనుకుంటే రోజూ అదే కల రావటం ఏమిటి?'

'వూఁ' నాకు యింకా వినాలనివుంది.

'ఏదో అభ్యర్థిస్తున్నట్లు వుంటాయి అతని చేష్టలు! అతను విచిత్రంగా నడుస్తాడు. తడుముకుంటూ నడిచినట్లు నడుస్తాడు. అతను ఎవరై వుంటాడు?'

'అతను ఎవరై వుంటాడు?' నేనామె వైపు చూశాను.

తల అడ్డంగా తిప్పింది అమృత. 'తెలియదు. నేను యింతకు ముందెన్నడూ చూడలేదు.'

'ఇప్పుడు కూడా నా?' ముందుకు వొంగాను.

'వుహూఁ'.

'ఎవరైనా ప్రేమభిక్ష అర్థిస్తున్నారేమో!' కవ్వింపుగా అన్నాను!

'మగబుద్ధి.'

'అత నెవరన్న ప్రశ్న మా ఆయన్ని అడిగితే ఆవగింజ అంత అతనికి అనుమానం మహావృక్షం అయింది. అది భరించలేకనే నేను తెగతెంపులు చేసుకున్నది' అంది.


సడన్‌గా నాకో అయిడియా తట్టింది.

'పోనీ అతని చిత్రం గీసి పైర్రి చేయరాదా?'

'అయిడియా బాగుంది. కానీ నాకు బొమ్మలు వేయడం రాదే! పిల్లి వేయమంటే కోతి వేసే రకాన్ని.'

'ప్రయత్నించండి. పదేళ్ళనుంచీ చూస్తున్న ముఖంకదా!' అనేసి వెళ్ళిపోయాను.

మర్నాడు నేను వెళ్ళేసరికి అమృత బెడ్‌మీద కుప్పలు కుప్పలుగా కాగితాలు వున్నాయి. స్కెచ్ పెన్‌తో కాగితం మీద గీస్తూవున్న ఆమె నా రాకను గమనించలేదు.



'ఈసారి ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో మీ చిత్రాలని ప్రదర్శించవచ్చును.'

వులిక్కిపడింది అమృత.

మాట్లాడకుండా ఓ ఐదారు కాగితాలు తీసి చేతిలో పెట్టింది.

ఒక్క చిత్రమూ సరిగా లేదు.

తను గీస్తున్న చిత్రం చూశాను. ఎవరో యువకుడు. నొక్కుల జుట్టు. పెదవులమీద సన్నటి నవ్వు. చెంపల వరకూ జుట్టూ. సన్నగా, పొడుగ్గా వున్న ముక్కు, ఆ కళ్ళు....వులిక్కిపడ్డాను.

ఆ కళ్ళల్లో జీవంలేదు.

'ఎంతో ప్రయత్నించాను. కానీ నా వల్లకాదు బాబు యింతకంటే బాగా రాదు. ఆ కళ్ళు గీయటం మాత్రం రావడం లేదు. ఏదో వొణుకు; యితనే నాకు పదేళ్ళనుంచీ కల్లో కన్పిస్తున్నది.'

నా కళ్ళు యింకా ఆ చిత్రాన్నే పరిశీలిస్తున్నాయి.

'కావాలంటే నా కళ్ళు పీకి పెడతాను ఆ బొమ్మకి.'

నా చేతిలోంచి కాగితం జారిపడింది.

'అలా అనకు అమృతా.'

'చూడండి డాక్టర్ మనిషికి చాలా స్వార్థం. తను వెళ్ళిపోయినా తన గుర్తుగా ఏవో మిగిల్చి వెళ్ళాలి అనుకుంటాడు. ఆస్తిపరుడు ఆస్తి వదలి వెళ్తాడు.'

'మీరు రచయితలు. మీరు పోయిన తరువాత మీ రచనల వల్ల కీర్తి వుంటుంది'

'యింక నాలాంటి సామాన్యురాలు ఏం మిగల్చగలదు, కళ్ళు, గుండె తప్ప?'

'నా గుండె రోగాలపుట్ట అందుకే కళ్ళు యిస్తాను. నేను పోయిన తర్వాత నైనా ఈ లోకాన్ని చూడగల్గుతాను.' క్షణం ఆగి తనలో తాను అనుకుంటు న్నట్లుగా అంది. ఇప్పుడిప్పుడే జీవితం మీద ఆశ చిగురిస్తోంది డాక్టర్! ఒక మనిషికోసం బ్రతకాలనుంది. కానీ ఇప్పటికే చాలా ఆలస్యం అయింది.

'అమృతా!'

నేను యింకా ఏదో చెప్పేలోపల ఛీఫ్ అర్జంటుగా రమ్మన్నాడని కబురు వచ్చింది. అసలే చండశాసనుడు. క్షణం అక్కడ నిలవకుండా వెళ్ళాను.

* * *

మర్నాడు వార్డుకు వెళ్ళిన నాకు అమృత బెడ్ చుట్టూ ఆకుపచ్చని స్క్రీన్ కనిపించింది.

ఎన్నో ఆశలతో, నన్ను నేను వంచించుకుంటూ వచ్చిన నాకు ఆ క్షణాన దేవుడు నవ్వుతూ 'నేనే గెలిచానోయ్ పిచ్చి మొహమా!' అన్నట్లుంది. శిలలా నిలబడిపోయాను.

అమృత యింకలేదు. నా గుండెల్లోంచి ఈ మాటలు యిప్పటివరకూ ఎవరూ వినలేదు. వొంటరిగా ఏడవడం కూడా వరం అయితే నాకు ఆ అదృష్టం కూడా లేదు

'సార్ ఆ పేషెంట్ మీకిది యివ్వమంది'

ఎవరిచ్చారో చూడనవసరం లేదు. అమృత యిచ్చి వుంటుందని గ్రహించాను.

రాధాకృష్ణా (సారీ డాక్టర్)!

బ్రతకాలనే అనుకున్నాను, నీ కోసం. బలీయమైన శక్తి నన్ను ఓడించి తను గెల్చింది.

దీనితోపాటు వున్న చిత్రం నువ్వు కోరితే నేను గీసింది కనుక వుంచుకోవూ.

మరి సెలవ్.

—అమృత

* * *

ఐదేళ్ళు గడిచిపోయాయి. నేను హాస్పిటల్‌నుంచి రిజైన్‌చేసి ఓ పల్లెటూరులో ప్రాక్టీస్ పెట్టాను. ఇదివరకంత బాధించడంలేదు అమృత జ్ఞాపకాలు.

నా కన్సల్టింగ్ రూమ్‌లోని డ్రాలో అమృత గీసిన చిత్రం యిప్పటికీ వుంది. దాన్ని చూస్తూ అమృతని తలుచుకుంటాను.

పుస్తకాలతో, పేషెంట్స్‌తో నాకు రోజులు గడుస్తున్నాయి. రోజూకన్న యివాళ అమృత నన్ను వెన్నాడుతోంది. నా ఎదుట నిల్చుని 'పెలిపతీమీద నమ్మకం వుందా?' అని అమృత అడుగుతున్నట్టు వుంది మనసేమీ బాగులేదు

పేషెంట్స్ అందరూ వెళ్ళిపోయారు. కాంపౌండర్‌ని కూడా వెళ్ళనిచ్చి నేను

తలుపులు వేయబోతున్నాను. హడావుడిగా లోపలికి వచ్చాడు అతను.

'మీరేనాండి డాక్టర్ రాధాకృష్ణ'.

'వూ(.' తల భుజంమీదుగా తిప్పి ఆ వైపు చూశాను.

నొక్కుల జుట్టు, కూలింగ్ గ్లాసెస్ పెట్టుకున్న అతను పొడుగ్గా సన్నగా వున్నాడు.

నాకు రాత్రిపూట కూలింగ్ గ్లాసెస్ పెట్టేవాళ్ళు అంటే చిరాకు.

'నా పేరు భార్గవ. ఓ పేషెంట్ గురించి అడగటానికి మీ దగ్గరకి వచ్చాను.'

'చెప్పండి.' కుర్చీ చూపించి అతన్ని కూర్చోమని నేనూ కూర్చున్నాను.

ఐదేళ్ళక్రితం మీరు ఉస్మానియాలో పనిచేసేటప్పుడు ఓ పేషెంట్ వుండేది. పేరు అమృత! మీకు గుర్తుందా?' అతను ఆతృతగా, ఎప్పుడెప్పుడు విషయాలన్నీ విందామా అన్నట్లున్నాడు. కొద్దిగా ముందుకి జరిగి ఆసక్తిగా నా వైపు చూశాడు.

'నన్ను నేను మరిచిపోతేకదా అమృతని మరిచిపోయేది?' సమాధానంగా తల వూపాను.

'ఆమె పుణ్యమా అని నేను ఇవాళ లోకాన్ని చూడగల్గుతున్నాను అతి ప్రయత్నంమీద ఆమె పేరూ ఆమెవున్న హాస్పటల్ తెలుసుకుని అక్కడికి వెడితే వాళ్ళు మీపేరు చెప్పారు. మీరు ఆమెతో ....అతను నాలుక కరుచుకుని తిరిగి మొదలుపెట్టాడు.

'ఆమె మీతో చనువుగా వుండేవారట కదా డాక్టర్! ఆమె ఫొటో కనీసం ఆమె గుర్తులు ఏవివున్నా ఓసారి ఇస్తారా? నేను ఈ లోకం అంతా చూసినా ఆమెను చూడనంత కాలం అంధుడినే! అతను ఎవరో తరుముకుని వచ్చినట్లు వాగుతున్నాడు.

అతనివైపు జాలిగా చూశాను. కృతజ్ఞత యీ రూపంలో యీ రాత్రి వెతుక్కుంటూ వచ్చింది అనిపించింది.

డ్రాయరు తీసిన నేను వులిక్కిపడ్డాను.

'అమృత గీసిన చిత్రం.'

'ఇతను' మార్చి మార్చి చూస్తూండిపోయాను. అతని చిత్రం అమృత ఎందుకు గీసింది? ఎలా గీసింది?

'ఏం డాక్టర్?' అతను కళ్ళద్దాలు తీసి కర్చీఫ్ తో తుడుచుకుంటూ నా వైపు చూశాడు. ఆ 'కళ్ళు'....అతని కళ్ళల్లోంచి అమృత నవ్వి సమాధానం చెప్పినట్లు అయింది.

అంతే—

